యుగకవి ఆవశ్యకత ఎంతైనా వుంది. నజ్రుల్ వంటి కవులు తిరిగి మనల్ని ముందుండి నడిపించాలి. తిరిగి మన ఆవేదనలకు నుడికార మిచ్చి ఘర్జించాలి!

ఏది యేమైనా నజ్రుల్ గొంతుక మాత్రం శాశ్వతంగా మన ప్రజల హృదయాలలో మారు మ్రోగుతూనే వుంటుంది. ఆ గొంతుక నిత్యం, దానికి శాంతి లేదు అంటాడు నజ్రుల్ యిస్లాం.

తను శాంతించే దినం గురించి చెబుతూ—

"ఆమి సెయిదిన్ హబ్ శాంత్
జబ్ ఉత్పీడితేర్ క్రందన్ రోల్
ఆకాశ్ బతాసే ధ్వని బెనా
అత్యాచారీర్ ఖడ్గ కృపాణ్
భీమ్ రణభూమి రణిబెనా
విద్రోహీ రణక్లాంత్
ఆమి సెయిదిన్ హబ్ శాంత్..."

కథానిక

# ప్రెసిడెంటూ : సెక్రటరీ

"శ్రీరాగి"

"ఎవరండీ లోపల, రామచంద్రరావుగారు ఉన్నారా?" అంటూ బయటనుంచి వచ్చిన కేక విని సుభద్రమ్మ కాఫీ త్రాగుతున్న భర్తతో "అప్పుడే తెల్లవారిందో లేదో మీకోసం ఎవరో వచ్చారు" అన్నది.

"అదిగో చూసావా, సూచనలు కనపడుతున్నయి" విజయగర్వంతో రామచంద్రరావు భార్యకు సమాధానమిచ్చాడు.

"ఎలెక్షన్లు ఇంకా కాకముందే మీ కింత గర్వమొస్తే, ఆ తర్వాత మీకు భూమిమీద కాలానుతుందా?" ఎత్తి పోడుస్తూ అన్నది సుభద్రమ్మ.

"అవునే, చాలామంది చిన్నప్పటినుంచీ నా జాతకం చూసినా, నా చెయ్యిచూసినా చాలా అదృష్టజాతకమని, దేశపరిపాలనా నిర్వహణంలో ఉన్నతోద్యోగం నిర్వహిస్తానని చెపుతుండే వాళ్లు" అన్నాడు రామచంద్రరావు.

"ఆ ధైర్యం చూసుకొనే కాబోలు మీరు జిల్లాబోర్డు ప్రెసిడెంటుగిరీకి పోటీచేయటం?" అన్నది సుభద్రమ్మ.

"కాకమరి?" అన్నాడు రామచంద్రరావు.

"అయినా జిల్లాబోర్డు ప్రెసిడెంటయితే మీకే మొరిగిందో?"

"నీ తెలివి తెల్లవారినట్లేవుంది. జిల్లాబోర్డు ప్రెసిడెంటు అంటే సామాన్యమా? ఎంత హోదా! ఎంత దర్జా! ఎంతమంది గుమాస్తాలు, నౌకర్లు మన చేతిక్రింద ఉంటారనుకొన్నావు? లక్షలకు లక్షలు మన చేతిమీదుగా ఖర్చు పెట్టుతూంటాము. మనకోసం ఆఫీసులో రోజూ ఎంతమంది పడిగాపులు కాచు కూర్చుంటారో పాపం!"

"ఊc బాగా నేవుంది. అసలు అవుతారో లేదో గాని ఇప్పుడే మురిసిపోతున్నారు. ఆవతలెవరో పెద్దమనిషి కనిపెట్టుకొన్నాడు. త్వరగా తెములండి."

రామచంద్రారావు కాఫీత్రాగి బయటికివచ్చి తనకోసంవచ్చిన పెద్దమనిషితో కలిసి. బయటికి వెళ్ళాడు. రామచంద్రరావు ఆ జిల్లాలో మోతుబరి భూస్వాములలో ఒకడు. ఈసారి జిల్లాబోర్డు ప్రెసిడెంటు గిరీకి పోటీచేస్తున్నాడు. తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నాడు కూడాను.

రామచంద్రరావు పాపం ఎలెక్షన్లు పనిమీద తిరిగి తిరిగి మధ్యాహ్నం ఇంటికిచేరాడు.

కాని ఇంటితలుపు తాళంవేసుంది. తిరిగి తిరిగొచ్చాడేమో బాగా అలసిపోయున్నాడు. తలుపుతాళం వేసుంటంచూసి తనలో తనే విసుక్కొన్నాడు.

ఇంతలో సుభద్రమ్మ గబగబావచ్చి తలుపు తాళం తీసింది.

రామచంద్రరావు అలసిపోయిన తన దేహాన్ని పడకకుర్చీలో చేరేసాడు.

"ఒంటిగంటయితే ఎక్కడ పెత్తనాలు చేస్తున్నావు?" విసుగుతో అడిగాడు సుభద్రమ్మని రామచంద్రరావు.

"పన్నెండు గంటలదాకా మీ కోసం చూసి ఇప్పుడే ఆ జానకమ్మగారింటి కెళ్ళానండీ."

"ఇప్పుడేంపడిపోయిందని నీ వామె గారింటికి వేళగాని వేళప్పుడు వెళ్ళటానికి"

సుభద్రమ్మ చిరునవ్వు నవ్వుతూ "ఏదో కొంచెం పనుండే వెళ్ళానండి. అంతగా కోపగించుకొంటారు దేనికి?"

"ఆ పనేమిటో చెప్పరాదూ? అదేమన్నా రహస్యమా?"

"రహస్యమూ లేదు ఏమీ లేదు. ఇంకా పది రోజులలో మా లేడీస్ క్లబ్బు సెక్రటరీని ఎన్నుకొంటారండీ. నేనుగూడా పోటీచేద్దామనుంది. మీరు జిల్లాబోర్డు ప్రెసిడెంటుగిరీ వెలగపెట్టుంటే నేను లేడీస్ క్లబ్ సెక్రటరీ నన్నా కాకపోతే బాగుంటుందా?"

"బలే. దివ్యమైనా ఆలోచన చేసావు, ఆ జానకమ్మను ఓటివ్వమని అడగటానికి వెళ్ళావన్నమాట" మందహాసం చేసాడు రామచంద్రరావు.

తను జిల్లాబోర్డు ప్రెసిడెంటు, తనభార్య లేడీస్ క్లబ్ సెక్రటరీ,—బలే బావుంటుంది అనుకొన్నాడు మనసులోనే రామచంద్రరావు.

తర్వాత పదీ పదిహేనురోజులకు సుభద్రమ్మ ఒకరోజు సాయంత్రం మాడ్చుకొన్న మొహంతో ఇంటికి చేరుకొంది. ఆ సాయంత్రం పనిచేసేదానికి తల వాచేటట్లు చివాట్లు తగిలినయి.

"ఏమండీ అమ్మగారూ, ఈ సాయంత్రము అలా ధుమధుమలాడుతున్నారు?' అమాయకంగా అన్నది పనిచేసేది.

"ఛా! పాడుముండా, చాకిరీసరిగాచెయ్యటం చేతగాక ఇంకా నన్నే అంటున్నావా?" అంటూ మరి రెండు చివాట్లు పెట్టింది సుభద్రమ్మ. పాపం దానికేం తెలుసు ఆ సాయంకాలం సుభద్రమ్మ లేడీస్ క్లబ్ సెక్రటరీపదవికిపోటీచేసిఓడిపోయిందని!

చీకటిపడుతుండగా రామచంద్రరావు దిగాలు పడ్డ మొహంతో ఇంటికిచేరాడు. ఆ రోజున ఎన్నికఫలితాలు వస్తాయని తెలిసిన సుభద్రమ్మకు భర్త కూడా ఎన్నికలో ఓడిపోయాడని గ్రహించింది.

"వెధవ జిల్లాబోర్డు ప్రెసిడెంటు పదవి! ఎవడిక్కావాలి. నెలకు వెయ్యిరూపాయలు జీతం ఇచ్చినా తీసుకోకూడదు. వెధవది ఒక్క క్షణం హాయిగా గాలి పీల్చుద్దామంటే తీరికుండదు. పైగా ఎప్పుడు చూసినా ఇంటిచుట్టూరా, ఆఫీసు చుట్టూరా మనుష్యులు! ఊపిరాడనిస్తారా? మావాడికి టీచరుపని ఇప్పించండి. మావాడికి గుమాస్తా పని ఇప్పించండి అని వేదిస్తారు. వీడికిస్తే వాడికి కోపం. వాడికిస్తే వీడికి కోపం. ఇంక ఏ మంత్రి వచ్చినా చుట్టూ తిరగలేక చావాలి. ఎందుకొచ్చిన లంపటం? ఇప్పుడు హాయిగావుంది" అన్నాడు రామచంద్రరావు.

"ఎందుకొచ్చిన సెక్రటరీ షిప్పు? లేనిపోని బాధ్యత నెత్తిమీద వేసుకోవాలిగదా? క్లబ్‌లో ఏది జరిగినా పూచీపడాలి. ఒక్కొక్కప్పుడు చేతి డబ్బుకూడా వదిలించుకోవాలేమో? వెధవ సెక్రటరీ షిప్పు. ఆ తాయారమ్మనే నెత్తిని వేసుకుని తిరగనీయి" అంది. లేడీస్ క్లబ్బు సెక్రటరీ పదవి గెలుచుకోని సుభద్రమ్మ.

కాని, ఎన్నిక ఫలితాలు తెలిసినరోజు రాత్రి చాలా ప్రొద్దుపోయేదాకా కూడా భార్యాభర్తలకు నిద్రపట్టలేదన్న విషయం మరునాటి వుదయం, ఎర్రటి జ్యోతుల్లాగా వారి కళ్ళను చూసినవాళ్ళు గ్రహించగలరు.

మరునాటి ఉదయం—

''రామచంద్రరావుగారూ!''అన్న కేక విని రామచంద్రరావు మండుతున్న తనకళ్ళను నులుముకొంటూ విసుగ్గా, వాకిలితలుపుతీస్తూ "ఎవరువారు?"అన్నాడు.

"నేనేనండి భుజంగరావుని"అన్నాడా వచ్చిన వ్యక్తి.

"రండి లోపలికి"అంటూ రామచంద్రరావు లోపలికి దారితీసాడు.

"ఏమండీ ఇంత ప్రొద్దుపోయిందీ?"

"అబ్బ! బద్ధకంగావుండి లేవలేకపోయినాను."

"అదేమిటండి, కళ్ళంత ఎర్రగావున్నాయి?"

"ఆఁ వేడిచేసిందిలెండి. ఇంతకీసంగతులు?"

"సంగతులు లేకపోతే ఇంత హడావుడిగా ఎందుకువస్తాను?"

"వెధవ ప్రెసిడెంటు పదవి! అసలు ఇటువంటి వాటికి మనబోటివాళ్లు ఎగబడటం బుద్ధితక్కువ. రెండునెలలనుంచి కంటికి సరిగా నిద్రలేదుగద!"

"అలా అంటారేమండి రామచంద్రరావుగారూ? మీబోటి పెద్దమనుష్యులంతా అలాంటి బాధ్యతతో గూడిన పదవులు నిర్వహించకపోతే దేశం ఏంగాను చెప్పండి?"

"ఏం దేశమో? యేం లోకమో? ఇంక లక్షరూపాయలు జీతమిచ్చి ఇస్తానన్నా నాకీ జిల్లాబోర్డు ప్రెసిడెంటు పదవిమాత్రం వద్దుబాబూ!"

"మీకు శుభవార్త చెప్దామని వస్తే మీరు నిరుత్సాహంగా మాట్లాడుతున్నారు."

"యేమిటో త్వరగా తేల్చండి. నాకు మహా విసుగ్గా వుంది."

"అవతల పార్టీవాళ్లు వేయించిన ఓ వంద ఓట్లు దొంగవోట్లు పడ్డట్టు తెలిసిందండీ."

"అంటే ఎలా వేయించారంటారు?" రామచంద్రరావు ప్రశ్నించాడు.

"ఊళ్ళల్లో లేనివాళ్ళ ఓట్లు ఎవరిచేతనో వేయించారుట. మనమిప్పుడు కోర్టులో ఈ యెలెక్షను చెల్లదని దావావెయ్యొచ్చు. ఆ ఓట్లు దొంగ ఓట్లని ఋజువుచేసే బాధ్యతంతా నామీద వదిలెయ్యండి" అన్నాడు భుజంగరావు.

రామచంద్రరావు తన ప్రత్యర్థి ఎలెక్షను చెల్లదంటూ కోర్టులో దావావేసే ప్రయత్నంలో నిమగ్నుడయ్యాడు......

సుభద్రమ్మ స్నేహితురాలు సుగుణ ఆదరాబాదరాగా సుభద్రమ్మకోసం వచ్చింది, ఆరోజు మధ్యాహ్నం భోజనానంతరం.

"సుభద్రమ్మా! ఈసంగతి విన్నావా?" అన్నది సుగుణ సుభద్రమ్మనుద్దేశించి.

"ఏసంగతి?" అన్నది సుభద్రమ్మ.

"తాయారమ్మ మన క్లబ్ సెక్రటరీగా పని చెయ్యబోవటం లేదట."

"ఎందుకని?" అడిగింది సుభద్రమ్మ.

"వాళ్ళాయన ఒప్పుకోలేదట. ఇకనుంచీక్లబ్బుకీ గిబ్బుకీ వెళ్ళటానికి వీల్లేదన్నాట్ట."

"అలాగా. అయితే మళ్ళీ సెక్రటరీ పోటీ జరుగుతుంది కాబోలు?"

"సరి సరి, తాయారమ్మే విరమించుకుంటే ఇంకా పోటీయేమిటి? ఇంక నీవే క్లబ్ సెక్రటరీవి" అన్నది సుగుణ.

"ఆఁ ఎందుకొచ్చిన సెక్రటరీ షిప్పులెద్దూ? లేనిపోని బాధ్యత నెత్తిమీద వేసుకోవాలి."

"నువ్వుకూడా అలాగంటే మన క్లబ్ గతేం కాను? నీకు తప్పదులే."

"అంతేనంటావా?" అన్నది సుభద్రమ్మ.

కొంతకాలం గడిచిన తర్వాత ఒక రోజు రాత్రి రామచంద్రరావు భార్యతో—"వెధవది ఎంత వదిలించుకోందామన్నా, ఆ జిల్లాబోర్డు ప్రెసిడెంటు పదవి మనల్ని వదిలేటట్టు లేదు" అన్నాడు.

"అలాగా? మీరు వేసిన దావా గెలిచిందన్న మాట" అన్నది సుభద్రమ్మ.

"ఏమిటో భుజంగరావు పట్టుబట్టి దావా వేయించాడుగాని నాకేం ఇష్టంలేదు సుమీ?"

"ఇంతకీ దావా గెలిచిందా?"

"ఆహా. నేనే ఎన్నికయినట్లుగా కోర్టువారు ఉత్తరువు లిచ్చారు."

"పాపం వద్దన్నా, లేనిపోని బాధ్యత మీ నెత్తిమీద పెడుతున్నారే? నా సంగతి అలానే అయింది కదా?"

"ఏమయిందేమిటి?"

"ఆ తాయారమ్మ ఇకక్లబ్బు పరిసరాలకే రానని కాకితంరాసి యిచ్చిందట."

"అలాగా? అయితే నీకు పోటీలేకుండా సెక్రటరీషిప్పు దొరికిందన్న మాట!"

"ఆ వెధవ సెక్రటరీ షిప్పు ఎందుకండీ? లేనిపోని బాధ్యత నెత్తిమీద వేసుకోవటమేగా" అన్నది సుభద్రమ్మ. "అంతేగామరి!" అంటూ శ్రుతి కలిపాడు భర్త రామచంద్రరావు. ఆ సమయంలో అప్రయత్నంగా భార్యాభర్తలు ఒకరినొకరు చూసుకొన్నారు.

వారి కళ్ళల్లో యేదో ఒకవిధమైన వెలుగు గోచరించింది. ★